# SRI NARLA VENKATESWARA RAO MEMORIAL LECTURE - 2022



## మార్గదర్శి నార్ల వెంకటేశ్వరరావు


by

**Tankasala Ashok**

Aadvisor to Telangana Government

(inter-state relations)


**On 04th December, 2022**

**At E-Class Room, STML Building, University Campus**

Organised by


**Dr. B.R. Ambedkar Open University**

Prof. G.Ram Reddy Marg, Road No. 46,

Jubilee Hills, Hyderabad (TS) 500 033

# About Dr. BRAOU

The University, initially known as Andhra Pradesh Open University, was set up on 26th August 1982 through an Act of the A.P.State Legislature (APOU Act 1982). Subsequently the University was renamed as Dr.B.R.Ambedkar Open University on 26th October,1991. The establishment of this University, the first of its kind in India, heralded and era of affirmative action on the part of the Government of Andhra Pradesh to provide opportunities of higher education to all sections of society to meet the changing individual and social needs. The University is providing services to the student community through a wide network of 179 study centres spread across both Telangana & Andhra Pradesh States, including 23 Regional Co-ordination centres and 11centres exclusively meant for women students. Prison inmates under life sentence also enrol themselves as students and pursue education through exclusive study centres at Central Prison - Cherlapally, Warangal, Rajahmundry, Visakhapatnam, Kadapa and Nellore and exclusive Study Centre for Army Personal and their family members, which was located at AOC, Secunderabad. The University offers Certificates, UG, PG Diploma and PG Degree and Research Programmes in including various Professional Programmes.

# Naarla Memorial Lecture



## మార్గదర్శి నార్ల వెంకటేశ్వరరావు

**శ్రీ టంకశాల అశోక్**
తెలంగాణ ప్రభుత్వ సలహాదారు
(inter-state relations)

Organised by
**Dr. B.R. Ambedkar Open Univeristy**
Prof. G. Ram Reddy Marg, Road No. 46,
Jubilee Hills, Hyderabad (TS) 500033

# మార్గదర్శి నార్ల వెంకటేశ్వరరావు

## శ్రీ టంకశాల అశోక్

నార్ల వెంకటేశ్వరరావు వంటి మహానుభావుని స్మారకోపన్యాసం చేసే అవకాశం నాకు కల్పించినందుకు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వారికి, నార్ల ట్రస్టు వారికి మొదట కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఇంతటి ముఖ్యమైన ప్రసంగం చేసేందుకు తగిన అర్హతలు నాకు నిజంగా ఉన్నాయో లేదోగాని, అటువంటి అవకాశమైతే లభించినందుకు ఎంతో సంతోషిస్తున్నాను. ఈ సందర్భంగా నాకు తోచిన విషయాలు కొన్ని మాట్లాడతాను.

ఇటీవల కొంతకాలంగా పత్రికలలో, టెలివిజన్ ఛానళ్లలో వార్తలు, వ్యాఖ్యల సరళి విజ్ఞులైన పాఠకులకు, శ్రోతలకు చాలా అసంతృప్తికరంగా ఉండటం అందరూ మాట్లాడుకుంటున్న విషయమే. ఇది అన్ని విషయాలకు సంబంధించి జరుగుతున్నది. కనీసం నాకు సంబంధించినంతవరకు, అంతర్జాతీయ పరిణామాలపై వార్తలు, వ్యాఖ్యల ధోరణి మరింత ఆందోళనకరంగా ఉంటున్నది. దినపత్రికలు, ఛానళ్ళు తమకు ఇంగ్లీషు ఏజెన్సీల నుంచి అందే వార్తలను యథాతథంగా ఇవ్వటానికి బదులు వక్రీకరించటం ఇందుకు కారణం. ఈ వక్రీకరణలకు ఒక కారణం జర్నలిస్టుల పరిజ్ఞానలోపమైతే, రెండవది వారికి ఏదో ఒక పక్షంపై ఉండే ప్రెజుడిసెస్. మూడవది ఆ వార్తలకు సోర్స్ పాశ్చాత్య వార్తాసంస్థలు కావటం, ఆ వార్తల పట్ల మన జర్నలిస్టులకు విచక్షణాదృష్టిని కలిగించగల పరిజ్ఞానం, అధ్యయనం లేకపోవటం. ఇందులో పరిజ్ఞాన లోపాన్ని సరిదిద్దుకోవచ్చు. కాని ప్రెజుడిసెస్ ను సరిదిద్దుకోవటం తేలికకాదు. అంతేకాదు. జర్నలిజం వృత్తివిలువలకు పరిజ్ఞాన లోపంకన్న ప్రెజుడిసెస్ వల్ల తీవ్రమైన హాని కలుగుతుంది. పోతే, ఆ వార్తలకు సోర్స్ పాశ్చాత్య వార్తాసంస్థలు కావటానికి సంబంధించి ఏమీ చేయలేము గాని, జర్నలిస్టులకు తమ అధ్యయనాల ద్వారా విచక్షణ దృష్టి ఏర్పడటం సాధ్యమే.

ఇటువంటి స్థితి మధ్య, నార్ల వెంకటేశ్వరరావు గారి జర్నలిస్టు జీవితం తొలిదశ గురించి కొంత తెలుసుకొన్నపుడు నాకు ఆశ్చర్యం, సంభ్రమం కలిగాయి. 1908

లో జన్మించిన ఆయన 1934–39 మధ్యకాలంలోనే, అనగా తన 26–31 ఏళ్ల వయసులో, అంతర్జాతీయ పరిణామాలపై నాలుగు పుస్తకాలు రాసారు. కేవలం అయిదేళ్లలో వరుసగా నాలుగు పుస్తకాలు. వాటి అంశాలు రష్యా, ఆస్ట్రియా, చెకోస్లోవేకియా, పాలస్తీనా. ఇదే ఒక ఆశ్చర్యకరమైన విషయం కాగా, ఇంతే ఆశ్చర్యకరమైనవి మరికొన్ని ఉన్నాయి. మొదట రష్యా పుస్తకం 'నేటి రష్యా' పేరుతో 1934లో వెలువడగా, అంతకు ఆరేళ్ళ క్రితమే 1928లో, తన 20వ ఏట, టర్కీలో జనరల్ కమాల్ అతాతుర్క్ తెచ్చిన సంస్కరణాత్మక తిరుగుబాటుపై ఒక వ్యాసం రాసారాయన. ఆ వ్యాసం శీర్షిక 'నేనే కమాల్ పాషాను అయితే'. అది వెలువడింది మరెక్కడోగాక సామాజిక సంస్కరణల బ్రహ్మసమాజం పత్రిక 'యువజన'లో కావటం విశేషం.

దీనంతటిలో గమనించవలసిన విషయాలు అనేకం ఉన్నాయి. నార్ల వారికి తనకు ఇంకా 20 ఏళ్ల వయసైనా రాక ముందునుంచే అంతర్జాతీయ పరిణామాలపై ప్రగాఢమైన ఆసక్తి ఏర్పడటం. టర్కీ నుంచి మొదలుకొని రష్యా, ఆస్ట్రియా, చెకోస్లోవేకియా, పాలస్తీనా వరకు అధ్యయనాలు సాగించి వ్యాసాలే గాక పుస్తకాలు రాయగలగటం. బ్రహ్మసమాజం వంటి సంస్కరణోద్యమంతోనూ పరిచయం, అభినివేశం ఉండటం. ఇందులో మరొక విషయాన్ని చెప్పుకుంటే మన ఆశ్చర్యం రెట్టింపవుతుంది. ఆయా అంశాలపై వ్యాసాలు సరేననుకున్నా పుస్తకాలు రాయగలగాలంటే ఎంతో సమాచారం, దానిపై అధ్యయనం, వివేచనా శక్తి తప్పనిసరి. అప్పుడే పుస్తకాలు రాయగలరు. ఇందులో సమాచారమన్నది ప్రాథమికం. ఇప్పుడంటే సమాచారం కోకొల్లలు. కాని అప్పటి 1920లు, 30లలో ఎక్కడిది? అప్పుడు తెలుగు పత్రికలే ప్రధానంగా మేగజైన్ల రూపంలో అరకొరగా ఉండేవి. బ్రిటిష్ వలసపాలనలో కలకత్తా, ఢిల్లీ వంటి చోట్ల నుంచి ఒకటీ అరా ఇంగ్లీషు దినపత్రికలు ఉండినా అవి నార్ల వారు నివసించే చోటికి ఏవి, ఎన్ని, ఎప్పుడు అందుబాటులోకి వస్తుండేవో తెలియదు. అప్పటికి ఆంధ్రదేశంలో కమ్యూనిస్టులు, వారి రహస్య పత్రికలు కొద్దిగా ఉండినా వాటి వ్యాప్తి, ప్రచురణాంశాలు అతి స్వల్పం. బిబిసి వంటి రేడియో సంస్థ 1920 లలోనైతే మొదలైందిగాని, దాని వ్యాప్తి నార్లవారు నివసించిన చోటికి ఎంతవరకు అందుబాటులో ఉండేదో తెలియదు. ఇక అంతర్జాతీయ పరిణామాలపై ఇంగ్లీషు పుస్తకాలు ఎక్కడో వెలువడుతుండినా అవి ఇక్కడి వరకు రావటం దుర్లభమైన సంగతి.

ఇన్ని పరిమితుల మధ్య, సమాచారలభ్యతకు గల అటువంటి గడ్డుకాలంలో, వీటిని అధిగమించటానికి నార్ల వెంకటేశ్వరరావు వంటి యువకుడు చేసిందేమిటి? అందుకాయన ఒక అద్భుతమైన మార్గాన్ని కనిపెట్టారు. అపుడు తరచు బందరుకు వస్తుండిన బ్రిటిష్ వాణిజ్య నౌకలు, ఓడల బరువును మెయింటైన్ చేయటం కోసం పాత పత్రికల లోడ్ వేసుకుని వచ్చి, ఆ పత్రికల కట్టలను ఇక్కడ రద్దీ కింద అమ్ముతుండేవి. సమాచారం కోసం వాటిలో తనకు వీలైనన్నిపాత పత్రికలు, మేగజైన్లు కొనుక్కొని చదవటం ఆయనకు అలవాటుగా మారింది. ఇంగ్లీషు భాష పట్ల ఆసక్తి, అది నేర్చుకోవటమే గాక అందులో రచనా నైపుణ్యం సైతం అప్పటికే సంపాందించిన నార్లకు ఆ విధంగా అంతర్జాతీయ పరిణామాల పరిజ్ఞానం తగినంత సంపాదించటం సమస్య కాలేదు. ఇక వాటిపై వివేచన, విశ్లేషణలు, భిన్న దృక్పథాలతో వెలువడే వ్యాసాలను పోల్చిచూసుకోవటం అన్న కృషి తన స్వంతం. ఆ విధంగా, అంతటి తొలిదశలోనే, అన్నన్ని పరిమితుల మధ్య, ఆయన ఆంధ్రదేశానికి సంబంధించిన అంశాలు సరేసరికాగా, విస్తారమైన విధంగా అంతర్జాతీయ వ్యవహారాల పట్ల గాఢమైన ఆసక్తి చూపి వ్యాసాలు, పుస్తకాలు రచించారు. ఇది ఎంతటి అసాధారణమో, నార్ల ప్రతిభకు ఎట్లా అద్దం పట్టిందో ప్రత్యేకంగా వివరించనక్కరలేదు. పైగా తన దృక్పథం అభ్యుదయశీలమైనది. ఆ ప్రగతిశీలత అటు అంతర్జాతీయ విషయాలతో పాటు, ఇటు స్వదేశంలో ముమ్మరంగా సాగుతుండిన స్వాతంత్రోద్యమంతో పాటు, సమాజ సంస్కరణాంశాలలో కూడా ప్రతిఫలించటం మనం గమనించదగ్గది.

నార్ల వెంకటేశ్వరరావు గారి జర్నలిజం వ్యాసంగానికి సంబంధించి రాయవలసినవి అనేకానేకం ఉన్నాయి. అందులో మొదటనే అంతర్జాతీయ విషయాలను ప్రస్తావించటానికి కారణం ఏమిటో మొదటనే సూచించాను. నిజానికి ఆయన ఈ రంగంలో చూపిన ఆసక్తి, ప్రతిభ తక్కిన అన్ని రంగాల కృషికి సంకేతం వంటిది అవుతుంది తప్ప కేవలం అందుకు పరిమితమైనది కాదు.

1920లు, 30ల నాటి పరిస్థితులు, పరిమితులలోనే అంతర్జాతీయం వంటి సుదూర అంశాలపై నార్ల చూపిన ఆసక్తి నుంచి, ప్రతిభ నుంచి ఇప్పటితరం జర్నలిస్టులు స్ఫూర్తి పొందవలసింది, ఆచరించవలసింది ఎంతున్నదో వేరుగా చెప్పనక్కరలేదు. స్థానిక అంశాలు, జాతీయ విషయాలు అప్పటి తెలుగు జర్నలిస్టులకు తగినంతగా తమ చుట్టూ అందుబాటులో ఉండినవే. అందుకు భిన్నంగా అంతర్జాతీయ

పరిణామాలు ప్రత్యేకమైన ఆసక్తి ఉండి శ్రమపడితే తప్ప అందుబాటులోకి వచ్చేవి కావు. అది కూడా పరిమితంగా. నార్ల తరం నాటి అంతర్జాతీయ పరిణామాలు మొదటి ప్రపంచయుద్ధం, రష్యా విప్లవం, టర్కీలో సైన్యపు సంస్కరణ తిరుగుబాటు, ప్రపంచ ఆర్థికమాంద్యం, ఫాసిజం, నాజీయిజం. ఇవన్నీ రెండవ ప్రపంచ యుద్ధం కన్న ముందటివి. నార్ల తర్వాత కొత్తగా వచ్చిన జర్నలిస్టు తరాలపై రెండవ ప్రపంచయుద్ధం, చైనా విప్లవం, తూర్పు%--%ఆగ్నేయాసియాలలో వియత్నాం తదితర సామ్రాజ్యవాదయుద్ధాలు, ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యాన శాంతియత్నాలు, ఆసియా, ఆఫ్రికా ఖండాలలో వలసవాద వ్యతిరేక ఉద్యమాల ప్రభావాలు ఉండేవి. ఈ సరికి నార్ల తరం బాగా ఎదిగిరావటమే గాక కొత్తతరం కూడా ఈ ప్రభావాలతో అంతర్జాతీయ పరిణామాల పట్ల అమితమైన ఆసక్తి చూపుతూ వచ్చింది.

నార్ల తొలిదశ ఎదుగుదల కాలానికి ఇప్పటికి ముఖ్యమైన తేడా ఒకటున్నది. పైన చెప్పుకున్నట్లు నార్ల తొలికాలంలో, ఆయా పరిణామాలపై పత్రికలు, పుస్తకాలు, రేడియో వంటి సాధనాల ద్వారా సమాచారపు కొరత తీవ్రంగా ఉండేది. ఈ కొత్త తరం ఎదిగి వచ్చేసరికి ఆ కొరత పూర్తిగా తీరిపోయింది. అక్షరాస్యత పెరుగుతూపోయింది. వారి వ్యాసాలు, పుస్తకాల వంటి రచనల ప్రచురణకు కూడా సమస్య లేకుండా స్థానికంగా పత్రికలు, ప్రచురణ సంస్థలు తగినంత పెరిగాయి. వీరందరి అధ్యయనాలు, చర్చలు విస్తృతమయ్యాయి. ఈ జర్నలిజం ధోరణులన్నీ దాదాపు 20వ శతాబ్దం చివరివరకు కొనసాగాయి. వారిపై అంతర్జాతీయ పరిణామాలతోపాటు వివిధ రాజకీయ, సామాజిక స్థానిక ఉద్యమాలు కూడా ప్రభావం చూపాయి. ఆ విధంగా, 1920లలో నార్ల తరంతో ఆరంభమైన ఈ జర్నలిజం ధోరణి, ఇంచుమించు 80 సంవత్సరాలపాటు కొనసాగింది. 60ఏళ్ళు దాటి చివరిదశ వస్తుండగా క్రమంగా బలహీనపడసాగింది. 1920లకు కొంతముందు నుంచే ఆరంభించి నార్ల తరం వరకు పలువురు ఇతర ప్రముఖ సంపాదకులు కూడా ముందుకు వచ్చారు. అది తెలుగు జర్నలిజానికి స్వర్ణయుగం అనాలి.

ఈ దశ తర్వాత ఏమిటన్నది ప్రశ్న. నేను మొదట ప్రస్తావించిన పరిజ్ఞానలోపం, వక్రీకరణల పరిస్థితి ఇందుకు సంబంధించినదే. 20వ శతాబ్దపు చివరిపాదంలో, అనగా సుమారు 1980 తర్వాత నుంచి జన్మించిన తరం ఇపుడు జర్నలిజం కొత్తతరంగా ఉనికిలోకి వచ్చింది. అంతర్జాతీయ పరిణామాల గురించిన వార్తలను

ఇపుడు పత్రికలలో రాస్తున్నది, ఛానళ్లలో చెప్తున్నది, వ్యాఖ్యానిస్తున్నది, యాంకరింగ్ చేస్తున్నది ఈ తరమే. అంతర్జాతీయ పరిణామాలలో ముఖ్యమైనవి అనేకం ఉంటున్నాయి. కాని వీరిలో ఆ పరిణామాల పట్ల నిజమైన ఆసక్తి, వివేచన కలగటం లేదు. నార్లతో పోల్చితే శూన్యమనాలి. కొద్దిమందిని మినహాయిస్తే వాటిగురించి వార్తలు, వ్యాసాలు, పుస్తకాలు చదవటం, చర్చించటం తక్కువ. స్వయంగా రాయటం, రాయగలగటం అంతకన్నా తక్కువ. అయినప్పటికీ ఆ వార్తలు రాసి, చెప్పి, వ్యాఖ్యానించే, యాంకరింగ్ చేసే బరువైన బాధ్యత వారిపైనే ఉంటున్నది. వారికి ఆయా సంస్థలు శిక్షణలు, ప్రోత్సాహాలు ఇవ్వటం లేదు. వాస్తవానికి ఈ కాలంలోనూ ఇరాక్, ఆఫ్ఘనిస్థాన్ వంటి యుద్ధాలైతేనేమి, ఉగ్రవాద చర్యలైతేనేమి ప్రపంచాన్ని కుదిపివేసాయి. యుక్రెయిన్ – రష్యా యుద్ధం ఇంకా కొనసాగుతున్నది. అమెరికాకు చైనా, ఉత్తర కొరియాలతో ఉద్రిక్తతలు తలెత్తాయి. తైవాన్ సమస్య ఇందుకు అదనంగా మారింది. ఇక ఆర్థిక సంస్కరణలు, ఆర్థిక సామ్రాజ్యవాదం వర్ధమాన దేశాలలో సృష్టిస్తున్న సమస్యలు, కల్లోలాలకు అంతులేకుండా ఉంది. పర్యావరణ సమస్యలు అనేక దీవులు, జాతుల ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. దీవులు కాని దేశాలలోనూ పర్యావరణ క్షీణత ప్రభావాలు, అందుకు వ్యతిరేక ఉద్యమాలు అంతటా కన్పిస్తున్నాయి. మొత్తం మీద మానవజాతి క్రమక్రమంగా అందరి అభివృద్ధి, మానవ సౌభ్రాత్రుత్వం, శాంతి సుఖాల వైపు పురోగమించటానికి బదులు, ఉద్రిక్తతలు, ఘర్షణలు, ఆధిపత్య ధోరణుల వైపు తిరోగమిస్తున్నది.

ప్రస్తుత చర్చకు సంబంధించి చెప్పేది ఏమంటే, ఈ వివిధ పరిణామాల గురించిన సమాచారం, గణాంకాలు, విశ్లేషణలు, భిన్న దృక్పథాలు, క్షేత్ర స్థాయి కథనాలు, చిత్రాలు, డాక్యుమెంటరీలు, వ్యాసాలు, పరిశోధనాపత్రాలు, పుస్తకాలు మొదలైన వాటికి ఎంతమాత్రం కొరతలేదు. ఇంటర్నెట్ సహా వేర్వేరు మార్గాలలో అది మనం ఉక్కిరిబిక్కిరయేంతగావచ్చిపడుతున్నది. చివరకు ప్రభుత్వాలు, ఆయా సంస్థల రహస్య నివేదికలు,డాక్యుమెంట్లు కూడా లీకై బయటకు వస్తున్నాయి. ఈ స్థితిని ఒకసారి నార్ల వెంకటేశ్వరరావు గారి 1920లు, 30ల నాటి సమాచార లభ్యత స్థితితో పోల్చిచూడండి. ఇపుడు ఇంత లభ్యత ఉన్నా ఇప్పటి తరం చేస్తున్న సాధారణ పఠనం, సీరియస్ అధ్యయనం, చర్చ, ఆలోచన, ఆయా విషయాల పట్ల తీసుకుంటున్న దృక్పథంతో, వారు ఆయా వార్తలు పత్రికలలో రాస్తున్న, లేదా టీవీలలో చెప్తున్న ధోరణితో పోల్చిచూడండి. నార్ల, ఆయన తరం చూపిన వృత్తిపరమైన తహతహ,

వృత్తి విలువలతో, వృత్తి నైపుణ్యాలతో పోల్చితే, అప్పటినుంచి వందేళ్ల తర్వాత మనం చూస్తున్న తరం ఏ విధంగా ఉన్నట్లు? నార్ల తరానికి, వందేళ్ల తర్వాతి తరానికి మధ్య భూమ్యాకాశాల అంతరం కనిపిస్తున్నది. ఒకటి స్వర్ణయుగమైతే రెండవది లోహయుగంగా పతనమవుతున్నది. వాస్తవానికి చదువులతోపాటు సమాచార లభ్యత ఇంతగా పెరిగినస్థితిలో మన జర్నలిస్టుల స్థాయి నార్ల కాలపు స్వర్ణయుగం నుంచి వజ్రవైఢూర్యాల స్థాయికి ఎదగవలసింది.

నార్ల తరంలో ఆరంభించి సుమారు 80 సంవత్సరాల పాటు సాగిన ఒక ధోరణి, 20 వ శతాబ్దపు చివరిపాదంతో మొదలైన కొత్తతరంతో మారటానికి కారణం ఏమిటి? అట్లా మారిన ధోరణి ఈ 21వ శతాబ్దపు తొలిపాదం ముగియవస్తున్నా కొనసాగటం ఎందువల్ల? మునుముందు అయినా ఇది మారవచ్చునా, మారకపోవచ్చునా? అన్నవి మాత్రం క్లుప్తంగానైనా మాట్లాడుకోవలసిన విషయాలు. లేనట్లయితే నార్ల వారసత్వానికి, స్మృతికి మనం న్యాయం చేసినట్లు కాబోదు.

పైన అనుకున్నట్లు, ముఖ్యమైన అంతర్జాతీయ పరిణామాలు ఈ కొత్తతరం కాలంలోనూ చోటు చేసుకున్నాయి. ఇప్పటికీ కొనసాగుతున్నాయి. కాని ఈ తరంలో అత్యధికులకు జర్నలిజం ఇతర వృత్తులవలెనే ఒక వృత్తి అయింది తప్ప అందులో వారికి కన్పించే ప్రత్యేకత ఏమీ లేదు. అదే స్థితి అంతర్జాతీయ విషయాలతో పాటు ఇతర విషయాలలోనూ కన్పిస్తున్నది. ఈ కాలానికి చెందిన మీడియారంగం యజమానులకు ఏ విధంగానైతే ఇతర ఉత్పత్తులు – వ్యాపారాలవలె ఇది కూడా ఒక ఉత్పత్తి – వ్యాపారరంగం అయిందో, జర్నలిస్టు సమూహానికి కూడా పైకి ఏమి మాట్లాడినా వాస్తవ దృష్టిలో ఇతర ఉద్యోగాలవలె ఇది కూడా ఒక ఉపాధి అయింది. నార్ల కాలంలో మీడియా యాజమాన్యాలు గాని, జర్నలిస్టులు గాని దీనిని కేవలం ఉత్పత్తి %--% వ్యాపారరంగంగా, ఉపాధి అవకాశంగా పరిగణించలేదు. ఆ విధంగా ఉభయులూ ఫోర్త్ ఎస్టేట్ అనబడే మీడియా ధర్మానికి, విలువలకు కట్టుబడి వ్యవహరించారు. జర్నలిస్టులు తమ నైపుణ్యాలను నిరంతరం పెంచుకోజూసారు. ఈ దృష్టి యాజమాన్యాలకు మారటం స్వాతంత్ర్యానంతరం నుంచి మొదలుకాగా, జర్నలిస్టులు మరో పాతికేళ్లవరకు నిలబెట్టుకున్నారు. అందుకు ఒక కారణం పాతతరం జర్నలిస్టులు తమ వెనుకటి వృత్తి ధర్మం, విలువలతో పాటు విషయ అధ్యయన దృష్టితో, సామాజికస్పృహతో ఇంకా జీవించి ఉండటం కాగా, రెండవ కారణం

వివిధ సిద్ధాంతాలు, ఉద్యమాలు 1960లలో, 70లలో ఈ వృత్తిలోకి కొత్తగా ప్రవేశించిన తరంపై చూపిన ప్రభావాలు. కనుక ఈ కొత్తతరం జర్నలిస్టులు కూడా అంతర్జాతీయ పరిణామాల గురించి వార్తలు, వ్యాసాలు, పుస్తకాలు శ్రద్ధగా చదివేవారు. ఆలోచించటం, చర్చించటం, రాయటం, గోష్టులలో పాల్గొనటం అవసరమని భావించేవారు. యాజమాన్యాల దృష్టిలో మార్పు వ్యాపారలాభాలు, ఇతర ప్రయోజనాల కోసం పైన పేర్కొన్న విధంగా ఉండినా, జర్నలిస్టుల దృష్టి మాత్రం నార్ల తరంవలెనే కొనసాగింది. బయట సమాజంలోని వివిధ ఉద్యమాలు, వాటిలో పలువురు జర్నలిస్టుల భాగస్వామ్యం ఈ కొనసాగుదలకు దోహదం చేసాయి.

కాని పైన అనుకున్నట్లు, 20 వ శతాబ్దపు చివరిపాదం వస్తుండగా ఈ స్థితి స్పష్టంగా మారటం మొదలైంది. అప్పటికే మారసాగిన యాజమాన్యాలు ఇపుడు ఆర్థికసంస్కరణలు, సంపదల పెరుగుదల కారణంగా ఆ ప్రయోజనాలను పొందగలమన్న ఆశాభావంతో, పొందాలన్న కోరికతో, మరింత మారసాగారు. అది కూడా ఎటువంటి మొహమాటాలు లేకుండా, వేగంగా కూడా.

ఇక జర్నలిస్టులు యథాతథంగానే, తమంతట తామే, పైన అనుకున్న విధంగా మారసాగారంటే, యాజమాన్యాలవైఖరిలో మార్పిడి, అందులోని వేగపు వత్తిడి, జర్నలిస్టుల మార్పిడిలో కూడా వేగాన్ని తెచ్చింది. మరొకవైపు సమాజంలో బలహీనపడుతుండిన ఉద్యమాలు, ఈ కొత్తతరం జర్నలిస్టులు కూడా వృత్తి విలువలు, వృత్తినైపుణ్యాలు, వృత్తి అధ్యయనాలు, దృక్పథాల రీత్యా మరింత బలహీన పడేందుకు పరోక్షరీతిన కారణమయ్యాయి. వారి ప్రాపంచిక దృక్పథమే మారింది. వారిలో ఒకప్పటి వివిధ స్పృహలు అన్నీ క్రమంగా పోతూ, వైయక్తిక ధోరణులు ప్రబలుతూ కేవలం తమకోసం తాము బ్రతకటం మొదలుపెట్టారు. ఈ మార్పులన్నింటి ప్రభావాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జర్నలిస్టుల అధ్యయనాలు, వార్తారచనలు, దృక్పథాలపై ఉంటూ వస్తున్నాయి. ఆ విధంగా నార్ల వారి తరం 20 వ శతాబ్దపు మొదటిపాదంలో, లేదా అంతకు కొంత ముందు నుంచే ఆరంభమై చివరిపాదం గడుస్తూ, ఈ 21వ శతాబ్దపు మొదటిపాదం వచ్చేసరికి తిరగబడిపోయింది.

అందువల్లనే కొంతకాలంగా అంతర్జాతీయవార్తలు మన పత్రికలలో, ఛానళ్లలో ఈ విధంగా దర్శనమిస్తున్నాయి. ఆ మాటకు వస్తే అన్ని వార్తలు కూడా. నార్ల టర్కీ సంస్కరణ విప్లవంపై మొదట వ్యాసం రాసారు. తర్వాత రష్యా కార్మిక విప్లవంపై

తెలుగులో మొదటి పుస్తకం రాసారు. ఆ విధంగా, అంతర్జాతీయ పరిణామాలకు సంబంధించి తెలుగు జర్నలిజంలో ఆయనది టర్కీ – రష్యా తరం అనవచ్చునేమో. ఆ తరువాత వచ్చినది చైనా – వియత్నాం తరం. అదే సంప్రదాయం కొనసాగి ఉంటే 20 వ శతాబ్దపు చివరిపాదం నుంచి ఇరాక్ – అఫ్ఘాన్ తరం మొదలుకావలసింది. కాని అట్లా జరగలేదు. అసలు ఏ తరమూ లేకుండా పోయింది. లేదా ఒక తొడలు విరిగిన తరం అవతరించింది.

ఈ మార్పులో భాగంగా అంతర్జాతీయ అంశాలు సరేసరి. ఈ విషయంలో మార్పు అన్నది సంకేతాత్మకమైనది మాత్రమేనని పైన అనుకున్నాము. ఇదే మార్పు అన్ని అంశాలలోనూ కనిపిస్తుంది. నార్లతో వ్యక్తిగతంగా పోల్చినా లేక ఆయన తరం తో పోల్చినా ఇపుడు వచ్చిన క్షీణతరమైన మార్పులు మరెన్నో ఉన్నాయి. నార్ల బహుముఖ ప్రతిభ గురించి మాట్లాడటం లేదిక్కడ. కేవలం జర్నలిజానికి సంబంధించిన మౌలిక విషయాల గురించి అంటున్నాను. ఉదాహరణకు సరైన పద ప్రయోగం, మంచి వాక్య నిర్మాణం, ఇంగ్లీషు పదాలకు సరైన తెలుగు పదాలను కనుగొనే యత్నం, ప్రజల వాడుక భాషను వెలికితీసి ఉపయోగించటం, ఆ విధంగా భాషాభివృద్ధి ప్రయత్నాల వంటివి. ఇవి తన తరంలో ఎట్లుండేవో, ఇప్పుడెట్లా ఉన్నాయో తెలిసిందే. అద్భుతంగా రాయగల వారు, మామూలుగానైనా చక్కగా రాయగలవారు, కనీసం దోషరహితంగా రాయగలవారు తగినంత మంది లేరని కాదు. కాని ఈ లక్షణాలు లోపించిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. పోతే, జర్నలిస్టులకు ఇంగ్లీషులో తగిన పరిజ్ఞానం ఎంత అవసరమో తెలిసిందే. ఆ రోజులలోనే నార్ల 22 ఏళ్ళు వచ్చేసరికి స్వయంకృషితో ఆ భాషపైన పట్టు సాధించి అందులో వ్యాసాలు రాసి, తర్వాత కాలంలో పుస్తకాలు సైతం ప్రచురించగా, ఈ కాలపు గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్ జర్నలిస్టులలో అత్యధికులు ఇంగ్లీషులో దోషరహితంగా ఒక చిన్న పేరాగ్రాఫ్ రాయలేని స్థితిలో ఉన్నారు. ఇంగ్లీష్ పత్రికలు, పుస్తకాలు చదివే అలవాటే లేదు వారికి. ఇందుకు సంబంధించి అనేకానేక సాధనాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ, ఈ విషయాలలో కూడా నార్లకాలం తిరగబడటం కొట్టవచ్చినటు కనిపిస్తున్న విషయం.

పోతే, నార్ల వెంకటేశ్వరరావు గారిని తెలుగు జర్నలిజంలో మూడవదశ ప్రతినిధిగా చెప్పవలసిఉంటుంది. ఆంధ్రప్రాంతంలో వ్యవసాయరంగం వెనుకబడి, ఇతరత్రా

ఆర్థికాభివృద్ధి లేక, అక్షరాస్యత తక్కువగా ఉండిన 1830లు, 40లు, 50 ల కాలంలో పత్రికలు ప్రధానంగా మద్రాసు నుంచి వెలువడుతూ వలసపాలకులకు, క్రైస్తవ మిషనరీలకు ఉపయోగపడుతుండేవి. అది మొదటిదశ. ఆ తర్వాత 1850 లలో కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల నిర్మాణంతో ఆర్థికపరమైన అభివృద్ధి నెమ్మదిగా మొదలై, సామాజికాభివృద్ధి కూడా జరుగుతూ, రెండవ దశ జర్నలిజానికి కారణభూతమైంది. ఆర్థికాభివృద్ధి ప్రభావం క్రమంగా అక్షరాస్యత, ఒక మోస్తరు చదువులు, సాహిత్యం, రచనలు, పత్రికాపఠనాసక్తి, సామాజిక కార్యకలాపాలు, సంస్కరణభావాలు, దూరప్రాంతాలతో సంబంధాల పైన పడసాగింది. దానితో వలసపాలకులతో గాని, మిషనరీలతో గాని సంబంధం లేకుండా చిన్న చిన్న కొత్తతరహా పత్రికలు రాసాగాయి. పత్రికలు, ప్రింటింగ్ ప్రెస్ లు మద్రాసు నుంచి ఆంధ్ర పట్టణాలకు మారాయి. వాటిలో భాషా సాహిత్య అంశాలు, సంస్కరణోద్యమాల విషయాలు, రాజకీయాలు, స్వాతంత్రోద్యమ వార్తలు, మహిళల అభ్యున్నతి, కులాల అభ్యున్నతి, తెలుగుజాతి భావాలు, జాతీయతాభావాల గురించిన వార్తలు, రచనలు వెలువడేవి. ఈ రెండవ దశ సుమారు 50 - 60 ఏళ్ల పాటు కొనసాగింది. జర్నలిజం, పత్రికలు ఈ విధంగా మొదటిదశ నుంచి రెండవదశ కు మారటానికి ప్రధాన కారణం వ్యవసాయం తదితర ఆర్థికాభివృద్ధి రంగాలలో వచ్చిన మెరుగుదల, తద్వారా విద్యా-సాహిత్య, ఉపాధి, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల మార్పులన్నది స్పష్టం.

రెండవదశలోని ఈ వివిధ మార్పులకు మూడవ దశ నుంచి ఒక ఊపు అనదగ్గది వచ్చింది. మరొకవిధంగా చెప్పాలంటే ఆర్థికంగా, సామాజికంగా పూర్తిగా వెనుకబడిన వలసపాలన దశ నుంచి, ప్రాజెక్టుల నిర్మాణంతో వ్యవసాయ, వ్యాపార అభివృద్ధి దశలోకి, లేదా పెట్టుబడిదారీ వ్యవస్థ పూర్వదశలోకి అడుగుపెట్టి, తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థలోకి మరికొన్ని అడుగులు వేయడమన్న మాట. మనం అంటున్న మూడవదశ ఇదే. నార్ల కాలం కూడా ఇదే. ఆంధ్రప్రాంత ఆర్థిక, సామాజిక, విద్యా - సాహిత్యాల, రాజకీయ చరిత్రను స్థూలంగా పరిశీలించినా ఈ విషయం అర్థమవుతుంది. 19 వ శతాబ్ది మధ్యలో కృష్ణా, గోదావరి ప్రాజెక్టుల నిర్మాణం, పంటకాల్వల వ్యాప్తి జరిగినప్పటినుండి మొదట ఆ మండలాలలో ఆహారధాన్యాల కొరత తీరటంతో ఆరంభించి క్రమంగా సంపదలు, స్థానిక పరిశ్రమలు, ద్రవ్యచలామణీ, పట్టణీకరణ, రవాణా, రహదారులు, విద్య, వైద్యం, వ్యాపారాలు, వినోదం, జీవనశైలి మార్పులు, కొత్తతరహాలో వివిధ సామాజిక, సాంస్కృతిక

కార్యకలాపాలు, మదరాసు వరకు ఎగుమతి దిగుమతులు, దాని వెనువెంట వాణిజ్యపంటల రాక వంటివి కనిపిస్తాయి. మరొకస్థాయిలో ఇదే దశలో బ్రహ్మసమాజ్ తదితర సామాజిక సంస్కరణ సంస్థలు, కాంగ్రెస్ నాయకత్వాన అప్పటికే సాగుతుండిన స్వాతంత్రోద్యమం ఆ ప్రాంతంలో అడుగుపెట్టాయి. రష్యా విప్లవం స్ఫూర్తితో కమ్యూనిస్టుభావజాలం, కార్యకలాపాలు కూడా ఆంధ్రదేశంలో ఆరంభమయ్యాయి. వీటన్నింటిని ప్రతిఫలించే మూడవదశ జర్నలిజాన్ని, జర్నలిస్టులను, తగినంత పరిణతి చెందిన స్థాయిలో మనమిపుడు చూడవచ్చు.

అందుకు అనుగుణంగానే నార్ల తెలుగు, ఇంగ్లీషులు బాగా నేర్చుకుని దేశ, విదేశ వ్యవహారాలలో ఆసక్తి చూపుతూ 1928లోనే తన 20వ ఏట టర్కీ సైనికవిప్లవంపై వ్యాసం రాసి, దానిని బ్రహ్మసమాజ్ వారి పత్రికలో ప్రచురించటం, 1929లో 19వ ఏట మద్రాసు కాంగ్రెస్ సభలలో పాల్గొనటం, 1931లో 21 వ ఏట వలస ప్రభుత్వానికి నచ్చనిది ఏదో రాసి పోలీసు లాఠీల బారిన పడటం, అదే సంవత్సరంలో ఇంగ్లీషు రచనలు మొదలుపెట్టటం, మరొక రెండేళ్లు గడిచినాక ఇంకా డిగ్రీ అయినా పూర్తి చేయకముందే స్వదేశీసంస్థానాలపై పుస్తక రచన, 1935లో 'ప్రభ' అనే పత్రికలో ఉద్యోగిగా చేరి 27వ ఏటనే ఆ పత్రిక నిర్వహణ బాధ్యతలు నిర్వర్తించటం వంటివి చేసి, 1941లో తన 33 వ ఏట ఆంధ్రప్రభ దినపత్రికకు సంపాదకుడైపోయారు. ఆ వేగవంతమైన పురోగతికి తన అసాధారణమైన ప్రతిభ, జ్ఞానసముపార్జన, శ్రమించేతత్వం కారణమని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. ఆ కాలమంతా ఆంధ్రప్రాంతం ఒకవైపు ఆర్థికంగా, రాజకీయంగా, మరొకవైపు సామాజిక – సాంస్కృతిక, విద్యారంగాలలో నానాటికి అభివృద్ధి చెందుతూపోయింది. జర్నలిజం రంగం ఇందుకు సమాంతరంగా వృద్ధి చెందింది. ఈ మూడవదశ అప్పుడప్పుడే ఆరంభమైన కాలంలో 1908లో జన్మించిన నార్ల, అదే దశ ప్రగతికి అనుగుణంగా స్వయంకృషితో, పట్టుదలగా ఎదుగుతూ, తన వయస్సుకు మించినవి సాధిస్తూ, ఆ దశలో జర్నలిజానికే గాక సాహిత్యరచనలకు, ఒక పౌరునిగా సామాజిక సంస్కరణలకు, దేశ రాజకీయ స్వాతంత్రోద్యమ క్రియాశీలతకూ ప్రతినిధిగా, పలువిషయాలలో అగ్రగామిగా నిలిచారు.

తన తరం గడిచిన వెనుక జర్నలిజం ఆ విధంగా ఉండబోదని, క్రమంగా క్షీణదశ మొదలు కాగలదని నార్ల ముందు చూపుతో పరిస్థితిని అంచనా వేయగలగటం ఒక విశేషం. సంపాదకుని స్థాయి ఎంతో గొప్పగా ఉండేదని మనం భావించే

1976 కాలంలోనే ఆయన, ఆ స్థాయిని యాజమాన్యాలు పతనం చేయటం గురించి విచారంతో వ్యాఖ్యానించారు. పైన మనం చెప్పుకున్న 20 వ శతాబ్దపు చివరిపాదం, లేదా క్షీణదశ మొదలవుతుండిన రోజులవి. అప్పటినుంచి మొదలైన తెలుగు జర్నలిజం నాల్గవదశలో మనమిపుడున్నాము. ఈ దశ వ్యాపార పెట్టుబడులు, టెక్నలాజికల్ ఇన్నోవేషన్లతో ఎంత విస్తరించి పెరుగుతున్నదో, సమాజంలో ఆర్థిక, సామాజిక అంతరాలు అంతగా పెరుగుతున్నాయి. జర్నలిజం , జర్నలిస్టుల వృత్తి ప్రమాణాలు, వృత్తి విలువలకు సంబంధించి గాని, జర్నలిజం ఆత్మ, పరమార్థత అయిన సామాజిక శ్రేయస్సుకు సంబంధించి గాని ఔన్నత్యాలు కన్పించటం లేదు. పైగా అందుకు విరుద్ధంగా జరుగుతున్నది. ఈ స్థితిని అంతిమంగా అరికట్టగలది స్వయంగా జర్నలిస్టులు, వారి వెంట నిలిచే సామాజికులే. జర్నలిజం రంగం అంతిమార్థంలో వారిది. వారికోసమే ఉనికి లో ఉన్నటువంటిది. నార్ల నమ్మింది, ఆచరించింది కూడా అదేనని చెప్పటమే పూర్తి సరైనదవుతుంది.

చరిత్రలో ఎప్పుడైనా, ఎక్కడైనా ఆర్థికశక్తులు అభివృద్ధి, పరివర్తన చెందటం మొదలైనపుడే సమాజ స్వరూపస్వభావాలు మారటం మొదలైంది. ఆయా రంగాల వికసనం జరిగింది. ప్రతిభ కలిగి శ్రమించిన వ్యక్తులు రాణించారు. సమాజ స్వరూపస్వభావాలలో జర్నలిజం కూడా ఒక భాగం. ఆ స్వరూపస్వభావాల మార్పులకు దశలు ఉంటాయి. ఆ దశలు అంతకు ముందటికన్న ఉన్నతస్థితిలోకి ప్రయాణిస్తుండిన కాలంలో నార్ల 'ద మ్యాన్ అండ్ హిజ్ టైమ్స్' అన్న పద్ధతిలో జీవించి అందుకు ప్రాతినిధ్యం వహించారు. తక్కిన భారతదేశంతో పాటు ఆంధ్రప్రాంతం కూడా ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనం, ఫ్యూడల్ జమీందారీల నుంచి, రాజకీయంగా అప్రజాస్వామికతల దశ నుంచి, ఫ్రెంచ్ విప్లవం, ఇంగ్లాండ్ పారిశ్రామిక విప్లవం ప్రభావాలతో, దేశీయంగా వలసపాలనా వ్యతిరేక స్వాతంత్రోద్యమ ప్రభావంతో నెమ్మది నెమ్మదిగానైనా ఆర్థిక, సామాజిక ప్రగతివైపు, ఫ్యూడల్ జమీందారీ వ్యవస్థలూ సంబంధాల విచ్ఛిన్నం వైపు, ఆధునిక ఆర్థిక వ్యవస్థలవైపు అప్రజాస్వామిక రాజకీయాలనుంచి ప్రజాస్వామికతల వైపు, అన్నిరంగాలలో, కుటుంబజీవనంలో కూడా సరికొత్త మానవ సంబంధాలవైపు తప్పటడుగులు వేస్తుండిన కాలమది. కొత్త సిద్ధాంతాలు, ఆలోచనలు కూడా గాలిలో వ్యాపించటం మొదలైంది. అటువంటి పరివర్తనా దశలో నార్ల జీవించి అందుకు ప్రాతినిధ్యం వహించారు. ఆ తర్వాత మెటీరియల్ అభివృద్ధి ఎంతున్నా వృత్తినైపుణ్యాలు, ప్రమాణాలు, విలువల క్షీణదశలో

ఈ తరం జర్నలిస్టులు జీవిస్తూ ఆ క్షీణతకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అదే సమయంలో, పైన అనుకున్నట్లు, ఈ స్థితిని అరికట్టగలది అంతిమంగా ఈ జర్నలిస్టులు, వారి వెంట నిలిచే సామాజికులే. అందుకు నార్ల స్ఫూర్తి, ఆయన తరం జర్నలిస్టుల స్ఫూర్తి వారిని వెన్నంటి ఉండగలదని ఆశిద్దాము.



## Tankasala Ashok

Tankasala Ashok, Former Editor, Senior journalist, comes from Madikonda village in Warangal district, educated in warangal, hyderabad, delhi. Worked in these places for different papers in different capacities across the Country.

# Dr. B.R. AMBEDKAR OPEN UNIVERSITY

## డా. బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం

